# రైతుల రుణ విముక్తి బిల్లు – సారాంశం

## పరిచయం:

ఈ బిల్లు రెండు అంశాల పై ప్రధానంగా కేంద్రీకరిస్తుంది:

1. రైతులను సత్వరం రుణాల నుండి విముక్తి చేయటం అంటే ప్రస్తుతం వున్న వ్యవసాయ రుణాలన్నింటి మాఫీ
2. రైతుల రుణ ఉపశమన కమిషన్ ద్వారా భవిష్యత్తులో రుణాల ఊబి నుండి రైతులను రక్షించటం

రైతుల తక్షణ రుణమాఫీని అమలు చేసే బాధ్యత నేరుగా ప్రభుత్వానిదే. భవిష్యత్తులో రుణ ఉపశమనం కోసం కమిషన్ పని చేస్తుంది. బ్యాంకు రుణాలను మాఫీ చేయటంతో పాటు ఈ బిల్లు సంస్థాగత రుణాలు కాని ప్రయివేటు రుణాల నుండి కూడా ఉపశమనం కలిగించే వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. తక్షణ రుణమాఫీ విషయంలో 'రుణ బదలాయింపు' పథకం ద్వారా రైతుల ప్రయివేటు వ్యవసాయ రుణాలను బ్యాంకు రుణాలుగా మార్చి ఆ తర్వాత ఆ బ్యాంకు రుణాలకు రుణమాఫీ వర్తింప చేయటం జరుగుతుంది.

భవిష్యత్తులో రుణ ఉపశమన కమిషన్ కు వ్యవసాయం సంక్షోభానికి గురైన ప్రాంతాలు, నష్టానికి గురైన పంటలను ప్రకటించే అధికారం వుంటుంది. దీనికి అనుగుణంగా కొన్ని రుణ ఉపశమన చర్యలను చేపట్టడం, అదనపు వడ్డీ భారం లేకుండా బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయటం, కొన్ని రుణాల మాఫీని సూచించటం, మూడు సంవత్సరాల వరకు రుణాల వసూలును నివారించడం, ప్రయివేటు రుణాల విషయంలో వడ్డీని మినహాయిస్తూ తీర్పు ఇవ్వడం, వాటిని బ్యాంకు రుణాలుగా బదలాయింపు చేయటం, బలవంతపు రుణాల వసూలును, రైతుల ఆస్తుల జప్తుని నిషేధించడం వంటి అధికారాలు కమిషన్ కి ఉంటాయి.

రాష్ట్రస్థాయిలో వ్యవసాయ రుణ ఉపశమన కమిషన్ వ్యవస్థ ఏర్పాటుకి ఒక నమూనా చట్టాన్ని రూపొందించమని ఈ బిల్లు నిర్దేశిస్తుంది. రాష్ట్ర స్థాయి కమిషన్ సహకార బ్యాంకులు, ప్రయివేటు వ్యవసాయ రుణాలతో సహా అన్ని రకాల రుణాల నుండి ఉపశమనం కలిగించే చర్యలను చేపడుతుంది. బలవంతపు రుణాల వసూలుపై, రుణాల చెల్లింపు కొరకు ఒత్తిడి, రైతుల ఆస్తులను జప్తు చేయటం లేక వేలం వేయడం పై నియంత్రణ చేస్తుంది.

## అధ్యాయం 1: వివిధ పదాల నిర్వచనాలు, వివరణలు

- **'వ్యవసాయం':** అన్ని పంటలు, అంతర పంటలు, ఉద్యాన పంటలు, ఔషధ మొక్కలు, పండ్లు, కూరగాయలు పెంచడం, పాల ఉత్పత్తి, చిన్న అటవీ ఉత్పత్తుల సేకరణ, పూలు, గడ్డి, మేటా గడ్డి, చెట్లు, భూమిలో పండించే ఇతర ఉత్పత్తులు, నర్సరీ నిర్వహణ, పశువుల పోషణ, చేపలు, తేనెటీగలు, పట్టుపురుగులు, కోళ్ళు, బాతులు, పందుల పెంపకం, మరియు భూమిని వ్యవసాయ అనుబంధ పనులకు, ఇతర వ్యవసాయ అవసారాలకు వినియోగించడం
- **"రైతు"**: ఒక వ్యక్తి పంటల ఉత్పత్తికి సంబంధించి ఆర్థిక, జీవనోపాధి కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనే వారు, స్వంత భూమి ఉన్నా, లేకపోయినా పైన పేర్కొన్న 'వ్యవసాయ' వృత్తిలో పాల్గొనే వారందరూ (సాగుదారులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, పాలుదారులు, పంట భాగస్వామ్య ఒప్పందంపై సాగు చేస్తున్న రైతులు, కోళ్ళు, పశువులు, ఇతర జీవాల పెంపకందార్లు, మత్స్యకారులు, తేనెటీగ పెంపకందార్లు, తోటలలో పని చేసే కార్మికులు, అటవీ ఉత్పత్తులను సేకరించే వారు, భూమిని కౌలుకి తీసుకొని గాని, ఉమ్మడిగా గాని సాగు చేసే స్వాయం సహాయక బృందాలు.

## అధ్యాయం 2: తక్షణ రుణ మాఫీ

- ప్రతి రైతుకు 2017 నవంబరు 20 నాటికి వున్న మొత్తం వ్యవసాయ రుణాలన్నిటినీ బేషరతుగా వెంటనే మాఫీ పొందే అర్హత వుంటుంది.

- రుణమాఫీ ఒకే విడతలో అమలు జరుగుతుంది. రుణ మాఫీ అమలు వలన తర్వాతి సీజన్లో రైతులకు రుణాల లభింపుపై ప్రభావం లేకుండా రైతులందరికీ కొత్త రుణాలను లభింపజేయాలి.
- సంస్థాగతం కాని ప్రయివేటు వ్యవసాయ రుణాలు కలిగి వున్న రైతులకు ఆ రుణాలను బ్యాంకు రుణాలుగా మార్పిడి చేస్తూ రుణ బదలాయింపు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుంది.
- ప్రైవేటు రుణాలను బ్యాంకు రుణాలుగా మార్పిడి చేసిన తర్వాత అటువంటి బ్యాంకు రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుంది.

## అధ్యాయం 3: రైతుల రుణ ఉపశమన కమిషన్

- రిటైర్డ్ సుప్రీమ్ కోర్టు జడ్జి అధ్యక్షులుగా తొమ్మిది మంది సభ్యులతో జాతీయ రైతుల రుణ ఉపశమన కమిషన్ ఏర్పడుతుంది, ఇందులో ఇద్దరు రిటైర్డ్ న్యాయమూర్తులు, నలుగురు రైతు ప్రతినిధులు, ఇద్దరు నిపుణులు, ఒకరు ఆర్థిక రంగం లేక సహకార రంగం నుండి సభ్యులుగా వుంటారు. ఈ కమిషన్ కాలపరిమితి 5 సంవత్సరాలు వుంటుంది, ఆ తర్వాత పొడిగించటానికి అవకాశం వుంటుంది.
- ఈ కమిషన్ రైతుల నుండి రుణ పథకాల అమలు గురించిన ఫిర్యాదులు స్వీకరిస్తుంది, కేసుల పరిష్కారానికి సంబంధించి ఆదేశాలు జారీ చేస్తుంది, ప్రభుత్వం అనుసరించవలసిన విధానాల గురించి నిర్దిష్టంగా ప్రకటిస్తుంది.
- భవిష్యత్తులో ప్రతి సంవత్సరం ఈ కమిషన్ నిర్దిష్ట జిల్లాలను లేక జిల్లాలోని కొన్ని ప్రాంతాలను సంక్షోభ ప్రాంతాలుగా లేక కొన్ని నిర్దిష్ట పంటలను నష్టపోయిన పంటలుగా ప్రకటించవచ్చు. తమ వద్దకు స్వయంగా వచ్చిన సమాచారం ఆధారంగా కానీ లేక ఎవరైనా పెట్టిన దరఖాస్తు ఆధారంగా కానీ నియమిత నిపుణులచే విచారణ తర్వాత కమిషన్ ఈ ప్రకటన చేయవచ్చు.
- ఆ విధంగా సంక్షోభ ప్రాంతాలు, నష్టపోయిన పంటలు ప్రకటించిన చోట్ల లో ప్రభుత్వం అమలు చేయవలసిన రుణ ఉపశమనాన్ని కమిషన్ సూచిస్తుంది. రైతులు బ్యాంకుల నుండి మరియు ప్రయివేటు వ్యక్తులు/సంస్థల నుండి తీసుకున్న రుణాలు మొత్తంగా కానీ పాక్షికంగా కానీ మాఫీ చేయమని సూచించవచ్చు.
- సంక్షోభ ప్రాంతాలు, పంటలు ప్రకటించిన చోట్లలో కమిషన్ క్రింది విధమైన చర్యలకై ఆదేశాలు జారీ చెయ్యవచ్చు:
    - స్వల్పకాలిక రుణాలను మధ్యకాలిక రుణాలగా, మధ్యకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా రీ షెడ్యూల్ చేయటం
    - కొన్ని రుణాల మాఫీ చేయటం
    - రైతు సిద్ధంగా వుంటే తక్కువ మొత్తాన్ని ఒకేసారి చెల్లించి రుణ విముక్తి పొందే అవకాశం కల్పించటం
    - మొత్తం వడ్డీని మాఫీ చేయటం
- రైతుల రుణ సమస్యలను పరిగణనలోకి తీసుకుని సంక్షోభ ప్రాంతాలలో కమిషన్ న్యాయనిర్ణేతలతో కూడిన చిన్న బృందాలు ఏర్పరిచి వారిచే విచారణ జరపవచ్చు
- సంస్థాగత రుణాలు కాని ప్రయివేటు రుణాల విషయం లో కమిషన్ ఈ క్రింది చర్యలు తీసుకోవచ్చు:
    - న్యాయమైన వడ్డీ రేటును నిర్ధారించటం
    - పంట నష్టం స్వభావాన్ని పరిగణన లోకి తీసుకుని మూడు సంవత్సరాలవరకు అన్ని రకాల రుణాల తిరిగి చెల్లింపును నిలుపు చేయటం
    - రుణాల బదలాయింపు అమలుచేయమని ఆదేశించి వాటిని బ్యాంకు రుణాలుగా మార్చటం
- వాణిజ్య బ్యాంకుల నుండి రైతులు తీసుకున్న రుణాల విషయంలో ఎదురవుతున్న సమస్యల గురించి వ్యక్తిగత రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించి రైతులకు ఉపశమనం కలిగించవచ్చు
- సంక్షోభ ప్రాంతాలు, పంటలు ప్రకటించిన చోట్ల ఆ బాధిత రైతుల రుణాల వసూలు కొరకు కోర్టు కేసులు వేయడంపై నిషేధం అమలులో ఉంటుంది; అప్పటికే రుణాల వసూలుకై కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లైతే వాటిపై స్టే విధించబడుతుంది.

- రైతు  తాను తీసుకున్న రుణం అసలు మొత్తం, అసలు మొత్తానికి సమానమైన మొత్తాన్ని (వడ్డీ క్రింద) చెల్లించినట్లయితే ఆ రుణం పూర్తిగా చెల్లించబడినట్లు పరిగణించబడుతుంది.

## అధ్యాయం 4: కేంద్ర ప్రభుత్వ బాధ్యతలు

- తక్షణ రుణ ఉపశమనం కలిగించటానికీ, రుణ ఉపశమన కమిషన్ సూచనలను, ఆదేశాలను అమలుచేయటానికి అవసరమైన ఆర్థిక వనరులను కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది
- రుణాలు ఇచ్చిన వారు ఆస్తులను వేలం వేయటం నుండి కొన్ని రకాల ఆస్తులను ప్రభుత్వం మినహాయిస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేస్తుంది
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పభుత్వాల కోసం  ఒక నమూనా చట్టాన్ని రూపొందిస్తుంది, ఆ చట్టం రాష్ట్ర స్థాయి రైతు రుణ ఉపశమన కమిషన్ ను ఏర్పరచి, దాని ద్వారా సహకార బ్యాంకులు, సంస్థాగతం కాని ప్రయివేటు రుణదాతల తో సహా రైతు రుణ ఉపశమన వ్యవహారాలను చేపడుతుంది.

## అధ్యాయం 5: ఇతరములు

- ఈ చట్టంలో పేర్కొన్న అంశాలకు విరుద్ధంగా మరే ఇతర చట్టంలోని అంశాలు ఉన్నట్లయితే ఈ చట్టంలో నిర్దేశించిన దానినే అనుసరించవలెను.
- ఈ చట్టం ప్రకారం రైతుల రుణ ఉపశమన కొరకు కమిషన్ ఇచ్చిన ఆదేశాలను ఏ సివిల్ కోర్టులో గాని, మరే ఇతర కోర్టులో గాని అప్పీల్ చేసే అవకాశం లేదు.

**అఖిల భారత రైతు పోరాట సమన్వయ కమిటీ (AIKSCC) – తెలంగాణా రాష్ట్రం**

**తేదీ: 21-12-2017**